ప్రైవేట్ రంగంలో .. రిజర్వేషన్లు కల్పించాలి

హిమాయత్‌నగర్ ,మే 28: ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్ నగర్‌లోని ఏఐవైఎఫ్ నగర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థ లు తగ్గి ప్రైవేట్ రంగం విస్తరిస్తుందని తెలిపారు. ఈ రంగంలో రిజర్వేషన్లు లేకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు దివ్యాంగులు,మహిళలు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సామాజిక, ఆర్థిక అసమానతలు మరింత పెరిగి అభివృద్ధికి ఆటంకం కలిగే అవకాశం ఉందని తెలిపారు. పేదలు మరింత పేదలుగా మారుతుంటే.. ధనవంతులు మాత్రం కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపించారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన ర్యాలీ

అడ్డగుట్ట, మే 28: బాలల హక్కుల పరిరక్షణ వేదిక, ఎంవీ ఫౌండేషన్, తల్లుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 'మద్యం, మాదకద్రవ్యాల'పై అవవాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి హాజరయ్యారు. అనంతరం వారు ర్యాలీగా తుకారం గేట్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని సీఐ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పిల్లల కదలికలపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని ఆమె సూచించారు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మద్యం, మాదకద్రవ్యాలకు బానిసకావడం వల్ల కలిగే అనర్థాలను యువతకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నక్క మధు, లింగాని శ్రీనివాస్, ప్రతినిధులు లక్ష్మినారాయణ, మద్యం, మాదకద్రవ్యాల కమిటీ, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు, యువ రత్నాల టీం సభ్యులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్‌గా సృజల

సికింద్రాబాద్, మే 28: ఇంద్రానగర్ కాలనీ బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ మిట్టపల్లి సృజల బాధ్యతలు స్వీకరించారు. జంగంమెట్, వట్టిపల్లి బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన సృజల నగరంలోని సికింద్రాబాద్ ఇంద్రనగర్‌కాలనీకి బదిలీ అయ్యారు. ఇంద్రనగర్ కాలనీ బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్‌గా సృజల బుధవారం బాధ్యతలు చేపట్టారు.

రోడ్లా..కుంటలా..!

ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహనదారులు

పుప్పాలగూడ పరిధిలోని కాలనీలో ..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రహదారుల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. కొన్ని రోజులుగా మున్సిపాలిటీ అధికారులకు స్థానిక ప్రజలు ఫిర్యాదులు చేసిఆ పట్టించుకోవడంలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా మున్సిపాలిటీ పరిధిలోని పుప్పలగూడ, సాయించంద్ర కాలనీ రోడ్లపై రెండు చోట్ల నీటి గుంతలు ఉంటున్నాయని.. రెండేండ్ల నుంచి..మొరపెట్టుకున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.. ఈ కాలనీ రోడ్లు అటు ల్యాంకో హిల్స్ వంద ఫీట్ల రోడ్డుకు, ఇటు మణికొండ నార్సింగి మెయిన్ రోడ్డుకు అప్రోచ్ రోడ్లుగా ఉండటంతో ఇక్కడ వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది.. దీంతో కాలనీ ప్రజలు, వాహనాలకు ఈ నీటి గుంతలు తీవ్ర అసౌకర్యంగా ఉండటమే కాక చిన్న చిన్న వాహనాలు ప్రమాదాలకు గురి అవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు సకాలంలో స్పందించి చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

– మణికొండ, మే 28 :

సాయి చంద్ర కాలనీలో..

జూన్ 21 వరకు యోగాపై అవగాహన

జూబ్లీహిల్స్, మే 28: జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నేటి నుంచి 25 రోజుల పాటు యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పీహెచ్‌సీల్లో ఇప్పటికే గర్భిణులకు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. కుటుంబ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు యోగా ప్రాధాన్యతను మరింత పెంచేందుకు ఈ నెల 28 నుంచి జూన్ 21 వరకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందులో భాగంగా పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు మాత్రమే కాకుండా బస్తీలు, కాలనీల్లో స్థానికుల సహకారంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

యోగాతోనే ఆరోగ్యం

డాక్టర్ బి. విజయ నిర్మల, ఎన్‌పీహెచ్‌ఓ, శ్రీరామ్ నగర్ క్లస్టర్..

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పీహెచ్‌సీలలో 25 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తాం. క్లస్టర్‌లోని జూబ్లీహిల్స్, వినాయక్‌నగర్, బోరబండ, శ్రీరామ్‌నగర్, బంజారాహిల్స్, షాకత్ నగర్ పీహెచ్‌సీ లతో పాటు 18 బస్తీ దవాఖానాలలో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తాం.

అంతర్జాతీయ యోగా డే సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలు

- ఈనెల 28 నుంచి జూన్ 1 వరకు..– అవేర్నెస్ క్యాంపులు, సోషల్ మీడియా ప్రమోషన్స్, కమ్యూనిటీ ఔట్ రీచ్, యోగా ట్రైనర్ల నియామకం.
- జూన్ 2 నుంచి 6 వరకు..– బేసిక్ యోగా ట్రైనింగ్ అండ్ కమ్యూనిటీ మొబిలైజేషన్.
- జూన్ 7 నుంచి 11 వరకు..– ప్రాణాయామం, ధ్యానంపై అవగాహన.
- జూన్ 12 నుంచి 16 వరకు..– స్వచ్ఛమైన గాలినందించే ఆవరణలో యోగా నిర్వహణకు పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించేందుకు మొక్కల పెంపకం, పర్యావరణ సమతుల్యత కార్యక్రమాలు.
- జూన్ 17 నుంచి 20 వరకు..– యోగా, ధ్యానం, ప్రాణాయామం ఇతర శిక్షణ కార్యక్రమాల పునఃశ్చరణ తరగతులు.
- జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలతో కార్యక్రమాలు ముగుస్తాయి.

కబ్జాకు యత్నిస్తున్న వారిపై క్రిమినల్ కేసు

'మేమింతే' కథనంపై స్పందన..

బంజారాహిల్స్,మే 28: ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించే క్రమంలో పలుమార్లు హెచ్చరిక బోర్డులు తొలగిస్తున్న కబ్జాదారుల వ్యవహారంపై నమస్తే తెలంగాణ ఈనెల 26న 'మేమింతే' పేరుతో ప్రచురించిన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లోని రూ.100కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని బోగస్ పత్రాలతో కాజేసేందుకు యత్నిస్తున్నాడంటూ గతంలో షేక్ ఖలీద్ అనే వ్యక్తిపై రెండు కేసులు నమోదయ్యాయి. అయితే వారంరోజుల క్రితం మరోసారి ఖలీద్ పేరుతో వివాదాస్పద స్థలంలో పోస్టర్లు వేయడంతో పాటు ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను తొలగించారు. దీంతో సమాచారం అందుకున్న షేక్‌పేట రెవెన్యూ అధికారులు ప్రైవేటు పోస్టర్లు తొలగించి ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాగా అదే స్థలంలో మరోసారి మూడురోజుల క్రితం షేక్ మహమ్మద్ జహంగీర్ పేరుతో మరోసారి పోస్టర్లు వేయడంతో పాటు ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను తొలగించారు. ఈ వ్యవహారంపై నమస్తే తెలంగాణ పత్రికలో 'మేమింతే' పేరుతో వచ్చిన కథనంపై స్పందించిన షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి మంగళవారం రాత్రి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడు షేక్ మహమ్మద్ జహంగీర్‌పై బీఎన్ఎస్ 329((3), 394(4)తో పాటు పీడీ పీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లోని ప్రభుత్వ స్థలం బయట ఏర్పాటు చేసిన ప్రైవేటు పోస్టర్లు (ఫైల్)

వందరోజుల ప్రణాళికపై అవగాహన

వందరోజుల కార్యాచరణ ప్రణాళిక పై కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్ చంద్ర

బండ్లగూడ, మే 28: వంద రోజుల ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా బుధవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టవలసిన కార్యాచరణ ప్రణాళికలు, వాటి అమలు పరచుట, రోజువారి ప్రణాళిక రూపకల్పన కోసం సిబ్బందికి కమిషనర్ శరత్‌చంద్ర అవగాహన కల్పించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వార్డు అధికారులతో సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. వార్డులలో నెలకొని ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం, పారిశుద్ధ్య పనులు చేపట్టడం అనేక పనులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మంజులత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యాదయ్య, రెవెన్యూ అధికారి శివకుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా.. హంగర్ ఫ్రీ వరల్డ్ క్యాంపెయిన్

ఖైరతాబాద్, మే 28 : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ద్వారా పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ హంగర్ ఫ్రీ వరల్డ్ క్యాంపెయిన్‌కు శ్రీకారం చుట్టిందని జోనల్ హెడ్ షరీజ్ తెలిపారు. బుధవారం సోమాజిగూడలోని మలబార్ షోరూమ్‌లో హంగర్ ఫ్రీ క్యాంపెయిన్‌ను కార్పొరేటర్ వనం సంగీత యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎస్ఆర్ కింద తమ సంస్థ రూ.150 కోట్లు కేటాయించామని, గడిచిన మూడేండ్లలో 2.5కోట్ల మందికి భోజనాలు అందించామన్నారు ఈ ఏడాది భారతదేశం, జాంబియా దేశాల్లో 70వేల మంది అన్నార్తుల ఆకలి తీర్చాలన్న లక్ష్యం పెట్టుకున్నామన్నారు. తెలంగాణలో ప్రతిరోజూ 2,100 మందికి భోజనాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షోయబ్, రాకేశ్ కుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత యాదవ్, షరీజ్ తదితరులు

పేదలకు నాణ్యమైన వైద్యం అందాలి

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

శంషాబాద్ రూరల్, మే 28 : పేదలకు నాణ్యమైన వైద్యమందించడమే లక్ష్యమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. బుధవారం శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే తన నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యమందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు వివరించారు. మండలంలోని పాలమాకుల గ్రామానికి చెందిన బాలరాజ్‌కు రూ.32వేలు, కవ్వగూడకు చెందిన రొడ్డసాయికి రూ. 38వేలు, సాయి 60వేలు, మెరుగు లావణ్య 38వేలు, జూకల్ గ్రామానికి చెందిన కుమార్‌కు రూ. 31వేలు, మల్కారం గ్రామానికి చెందిన ప్రేమలతకు రూ. 50వేల చొప్పున చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్‌యాదవ్, సత్యానందం,మహేందర్,నరేష్ గౌడ్, శ్రీకాంత్, రమేష్, శ్రీధర్‌గౌడ్, ఆదర్శ్, చందు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తాళాలు పగలకొట్టి నగదు చోరీ

వెంగళరావునగర్, మే 28 : తాళాలు పగలగొట్టి లాకర్‌లోని రూ.2.20 లక్షలను దొంగలు అపహరించుకెళ్లారు. ఎస్.ఆర్.నగర్ పోలీసుల కథనం ప్రకారం అమీర్‌పేట్‌లోని లీలానగర్‌కు చెందిన మనోజ్ కుమార్ బజాజ్ (44),11 ఏండ్లుగా శ్రీ రామ్ దేవ్ ట్రేడర్స్ పేరుతో ఎఫ్.ఎం.సి.జి డిస్ట్రిబ్యూటర్‌షిప్‌ను బల్కంపేట్‌లోని లింగయ్యనగర్‌లో నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి కార్యాలయానికి తాళం వేసి వెళ్లిన మనోజ్ కుమార్ మంగళవారం ఉదయం వచ్చి చూడగా..ఆఫీస్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. కార్యాలయంలోని లాకర్‌లో భద్రపరిచిన రూ. 2.20 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ ఘటనపై బాధితుడు మనోజ్ కుమార్ బజాజ్ ఎస్.ఆర్. నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి

సికింద్రాబాద్, మే 28: ఆపదలో ఉన్న వారిని ఆదుకొని వారికి తగిన సహాయం అందించాలని సికింద్రాబాద్ నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చేపూరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మున్నూరు కాపు బిడ్డ బి.సంతోష్‌కుమార్ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న చేపూరి వెంకటేశ్వరరావు, పట్నం సంగీత, మురళీకృష్ణ కుటుంబానికి నిత్యావసర వస్తువులతో పాటు కొంత ఆర్థిక సహాయం చేశారు.

ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి

రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్

మైలార్‌దేవ్‌పల్లి, మే 28: ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సిబ్బంది ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతూ రోడ్లపై నిలిచే వర్షం నీటి తొలగింపు పనులను చేపడుతున్నారని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ అన్నారు. గగన్‌పహాడ్ ప్రాంతంలో కురిసిన వర్షానికి రోడ్లపై నిలిచిన వరద నీటి తొలగింపు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. డ్రైనేజీలో వ్యర్థాలు, కవర్లను తీసివేసి నీరు వెళ్లేందుకు పనులు నిర్వహించడం జరుగుతుందన్నారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో ఇప్పటికే డ్రైనేజీల శుభ్రత పనులను చేపట్టి వ్యర్థాల తొలగింపులు చేపట్టామన్నారు. వర్షాలకు రోడ్లపై చేరే నీటిని తొలగించేందుకు మాన్‌సూన్ సిబ్బంది సైతం అందుబాటులో ఉన్నారన్నారు. వాహనదారులకు, పాదచారులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవోహెచ్ రజనీకాంత్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

గగన్‌పహాడ్‌లో రోడ్లపై నిలిచిన నీటి తొలగింపు పనులను పరిశీలిస్తున్న సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్, ఏఎంవోహెచ్ రజనీకాంత్ తదితరులు

తెలుగు ప్రజల గౌరవం పెంచిన మహనీయుడు ఎన్టీఆర్

– సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ

బంజారాహిల్స్,మే 28: తెలుగు ప్రజలకు ప్రపంచ వ్యాప్తంగా గౌరవాన్ని పెంచిన మహనీయుడు స్వర్గీయ ఎన్‌టీఆర్ అని ప్రముఖ సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ అన్నారు.ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకల్లో భాగంగా ఫిలింనగర్‌లోని ఆయన విగ్రహానికి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులతో కలిసి పలువురు సినీ ప్రముఖులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రచయిత పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ..మనదేశం సినిమా ద్వారా సినీరంగంలో అడుగుపెట్టిన ఎన్టీఆర్ పౌరాణిక పాత్రలతో పాటు అనేక రకాలైన పాత్రలను పోషిస్తూ తెలుగువారి గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి మోహనకృష్ణ,నందమూరి సీమ, నందమూరి రూప, నిర్మాత ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సినీ ప్రముఖులు, నందమూరి కుటుంబ సభ్యులు

యువకుడు అదృశ్యం

కుమారస్వామి (ఫైల్)

శంషాబాద్ రూరల్: ఉద్యోగం చూసుకోవడం కోసం వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసు కున్నది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్ గ్రామానికి చెందిన కుమారస్వామి(23) ఈ నెల 25న సాయంత్రం తన కారులో చెన్నైలో ఉద్యోగం చూసుకోవడం కోసం వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన యువకుడికి కుటుంబ సభ్యులు పలుమార్లు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో అతడు ఎక్కడ ఉన్నాడో తెలియకపోడంతో కుటుంబ సభ్యులు వారి బంధువుల వద్ద తెలిసిన చోట వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

బేగంపేట్, మే 28: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ శిక్షణ కేంద్రం (టీటీఐ) సెంటర్ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ అన్నారు. బుధవారం బేగంపేట్‌లో ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో టాటా ప్రాజెక్ట్ లిమిటెడ్ సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు, నివారణ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

ఆర్టీసీ బస్సులో గొలుసు చోరీ

బంజారాహిల్స్,మే 28: బస్సులో ప్రయాణిస్తున్న యువకుడి దృష్టి మరల్చి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని నూర్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓంసాయి ప్రకాశ్ అనే యువకుడు సోమవారం రాత్రి మెహదీపట్నం నుంచి ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని జీవీకే బస్‌స్టాప్ వద్దకు రాగానే వెనకనున్న ముగ్గురు యువకులు అతడిని వేగంగా ముందుకు తోశారు. ఈ క్రమంలో అతడి మెడలోంచి తులం బంగారం గొలుసు కాజేశారు. బస్సు దిగిన తర్వాత కొంతసేపటికి తన గొలుసు పోయినట్లు గుర్తించిన బాధితుడు తన సోదరుడి బైక్ మీద కొంత దూరం ఆర్టీసీ బస్సును వెంబడించాడు. పంజాగుట్ట నాగార్జున సర్కిల్‌లో ముగ్గురు యువకులు హడావుడిగా దిగిపోయారని కండక్టర్ వెల్లడించాడు. దీంతో వారే చోరీకి పాల్పడి ఉంటారని బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మాదిగలకు మంత్రి పదవి ఇవ్వరా..!

సమావేశంలో అభివాదం చేస్తున్న పిడమర్తి రవి, సురేశ్ తదితరులు

ఖైరతాబాద్, మే 28 : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పాటు ఎమ్మెల్సీ స్థానాల్లో మాదిగలకు అన్యాయం చేసిన కంగ్రెస్ ప్రభుత్వం కనీసం మంత్రి పదవీ ఇవ్వాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే మెజార్టీగా ఉన్న మాదిగలకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మోసం చేస్తూనే ఉందన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చలేదని, చివరకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఇవ్వలేదన్నారు. మంత్రి వర్గ విస్తరణలో మాదిగలకు మంత్రి పదవీ ఇవ్వకుంటే కాంగ్రెస్ పార్టీకి ఆ వర్గం దూరమవుతుందన్నారు. ఈ సమావేశంలో జాతీయ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుదాల బాబురావు, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేశ్, మొగులయ్య, మహేశ్, నరేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రభుత్వం ప్రకటించిన దళిత రత్న అవార్డులో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంగని రాజు,ఉపాధ్యక్షులు గుండడ అమూల్‌రాజు,దళిత సంఘం మాజీ అధ్యక్షులు గుండడ శేఖర్‌లను తెలంగాణ రాష్ట్ర ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుకల రాజు,బండ్లగూడ జాగీర్ మాజీ సర్పంచ్ గంగని హరికృష్ణ బుధవారం సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత సంక్షేమానికి ఎల్లప్పుడూ విధేయులుగా ఉండాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానికుడు ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు. – బండ్లగూడ,మే 28

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా కృషి చేద్దాం

డీఈఓ సుశీంధర్ రావు

బండ్లగూడ, మే 28: తెలంగాణలో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంధర్ రావు పేర్కొన్నారు. రాజేంద్రనగర్ మండల ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు జరుగుతున్న శిక్షణ శిబిరంలో బుధవారం గణితం, ఫిజికల్ సైన్స్‌పై అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు అవుతున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఇందులో భాగంగానే పలు అంశాలను పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా ఉపాధ్యాయులకు చూపించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, రిసోర్స్ పర్సన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE-CUM-FAMILY COURT, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: MALKAJGIRI
O.S. No. 80 OF 2024

BETWEEN:
U. Srinu & Others
... Petitioners/ Plaintiffs No. 1 to 21
And
Sri. Baddam Buchi Reddy & Others
... Respondents/ Defendants No.1 to 12
To,
11. M/s. VSR CONSTRUCTIONS & PROPERTY DEVELOPERS Pvt., Ltd., A company having its registered Office at C-61, II Floor, Madhura Nagar, Yosufguda, Hyderabad-500038, A.P., Represented by its Managing Director, Sri. CHINNAM RAMA KOTAIAH S/o. C.SUBBA RAO, Aged about 64 years, Occ: Business, R/o. H. No. H-68, Madhura Nagar, Yousufguda, Hyderabad-500038. Telangana.

NOTICE

Please take notice that, the above Petitioners/ Plaintiffs have filed above petition to grant temporary injunction from alienating the petition schedule property against you and others, the said case stands posted to 22-06-2025 for your appearance. Therefore, you are hereby directed to appear before the above Hon'ble Court on 22-06-2025 at 10:30 am either in person or through an advocate, failing which the matter will be decided ex-party.
(By the order of the court)
Sd/- **P.DAMODAR REDDY,** Advocate
H.No. 7-1-29, Flat No.BG-4, United Avenue North End, Leela Nagar, Ameerpet, Hyderabad, Telangana-500016.
Cell: 9704638568.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE-CUM-FAMILY COURT, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: MALKAJGIRI
I.A. No.333 OF 2024
IN
O.S. No. 80 OF 2024

BETWEEN:
U. Srinu & Others
...Petitioners/ Plaintiffs No. 1 to 21
And
Sri. Baddam Buchi Reddy & Others
... Respondents/ Defendants No.1 to 12
To,
11. M/s. VSR CONSTRUCTIONS & PROPERTY DEVELOPERS Pvt., Ltd., A company having its registered Office at C-61, II Floor, Madhura Nagar, Yosufguda, Hyderabad-500038, A.P., Represented by its Managing Director, Sri. CHINNAM RAMA KOTAIAH S/o. C. SUBBA RAO, Aged about 64 years, Occ: Business, R/o. H. No. H-68, Madhura Nagar, Yousufguda, Hyderabad-500038. Telangana.

NOTICE

Please take notice that, the above Petitioners/ Plaintiffs have filed above petition to grant temporary injunction from alienating the petition schedule property against you and others, the said case stands posted to 22-06-2025 for your appearance. Therefore, you are hereby directed to appear before the above Hon'ble Court on 22-06-2025 at 10:30 am either in person or through an advocate, failing which the matter will be decided ex-party. (By the order of the court)
Sd/- **P. DAMODAR REDDY,** Advocate
#H.No.7-1-29, Flat No. BG-4, United Avenue North End, Leela Nagar, Ameerpet, Hyderabad, Telangana-500016.
Cell: 9704638568.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE-CUM-FAMILY COURT, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: MALKAJGIRI
**I